"అవును. అమ్మా అప్పుడు నాన్నగార్ని కుస్తీపోటీలో ఓడించేస్తా -డిష్యుం-" అంటూ నన్ను ఒక్కటిచ్చుకున్నాడు. తృటిలో నా ముక్కు చితికిపోయే ప్రమాదం తప్పింది.

వాడు బయటకు వెళ్ళాకా-

"ఏమిటోయ్ విశేషం" అని అడిగాను శ్రీమతిని,

"దానికి మీకు అసలు మతిలేదు వీక్లీలో పడే మందుల ప్రకటనలో పహిల్వాన్ బొమ్మతీసి ప్రొద్దున కొన్న మందుసీసా మీద అంటించేను. వాడేమో దారాసింగ్‌లా తయారవ్వడానికి మందనుకుని చేదుగా వున్నా బలవంతగా త్రాగేశాడు" అంది విజయగర్వంతో, ఛాలెంజర్‌లో పైకి వెళ్ళినంత సంతోషంతో.

—o—

## శైలవ్

ఆ గదినిండా అగరవత్తులు సువాసన వెదజల్లుతున్నాయి. ఒక కుర్చీలో సూటు వేసుకున్న యువకుడు కూర్చుని వున్నాడు. అతను నల్లగా తుమ్మ మొద్దులా వున్నాడు. నవ్వితే తెల్లని పళ్లు భయంకరంగా కనిపిస్తున్నాయి. అతను పెళ్ళిచూపులకు వచ్చిన అబ్బాయి. ఆతని ప్రక్కనే అతని తల్లిదండ్రులు, ఆ ప్రక్కనే అమ్మాయి తల్లిదండ్రులు నిలబడి వున్నారు.

అందరూ కాఫీ ఫలహారాలు పూర్తిచేశారు.

"అమ్మాయిని తీసుకురా" అన్నాడు అమ్మాయి తండ్రి.

లోపలినుండి అమ్మాయి రాకకోసం ఎదురు చూస్తున్నాడు అబ్బాయి.

అమ్మాయిని తీసుకువచ్చారు.

చామనచాయగా బొద్దుగా వుందా అమ్మాయి. పసుపురంగు విమల్ చీర మీద అదేరంగు జాకెట్ వేసుకుంది. పెళ్ళికొడుకుకన్నా ఏమంత ఎత్తుగా లేదు. ఆ అమ్మాయి ఎంత దాచుకుందామనుకున్నా ముందుకు వచ్చే పై పళ్లు స్వాతంత్ర్యం కోసం పోరాడుతూ ముందుకు వస్తున్నాయి. అదొక్కటే లోపం పాపం ఆ అమ్మాయికి.

కుర్చీలో కూర్చుంది.

''అమ్మాయి పేరు''

''విశ్వసుందరి''

''మా అమ్మాయి పుట్టినప్పుడు విశ్వసుందరి పోటీలు జరుగుతున్నా యండి. అందుకని అలా పేరుపెట్టాను'' అన్నాడు అమ్మాయి తండ్రి.

కొంచెంసేపు అమ్మాయిని నఖశిఖ పర్యంతం పరీక్ష చేశాక లోప లకు తీసుకువెళ్ళే ప్రయత్నంలో లోపలినుంచి ఒక అమ్మాయి వచ్చింది.

ఆ అమ్మాయి

ఆ అమ్మాయికాదు. మెరుపుతీగె. గులాబిరంగు పోలియెస్టర్ చీర, అదేరంగు జాకెట్ కట్టుకుంది. మెరిసిపోయే శరీరపు నిగారింపు. పెళ్ళి చూపులకు వచ్చిన అబ్బాయి కన్నార్పకుండా ఆ అమ్మాయిని చూస్తున్నాడు.

ఇది గమనించిన అమ్మాయి తండ్రి.

''ఈ అమ్మాయి మా ఎదురింటివారి అమ్మాయండీ. మనవాళ్ళు కాదు'' అన్నాడు పెళ్ళికూతురి తండ్రి.

తన పరిస్థితిని గమనించినందుకు సిగ్గుపడి సర్దుకున్నాడు అబ్బాయి.

కొంచెంసేపు పిచ్చాపాటి మాట్లాడుకున్నాక వెళ్ళాక ఉత్తరం వ్రాస్తా మని వాళ్ళు వెళ్ళిపోయారు.

పదిరోజులు గడిచేక

పెళ్ళివారి దగ్గరనుండి ఉత్తరం వచ్చింది.

''మేము మీ అమ్మాయిని చూస్తున్న సమయంలో వచ్చిన అమ్మాయి మీ రెండవ అమ్మాయని తెలిసింది. ఆ అమ్మాయిని చూసి మా అబ్బాయి మనసుపడ్డాడు. కాబట్టి పెద్దమ్మాయి పెళ్ళి అయ్యేవరకూ ఆగుతాము. చిన్న అమ్మాయికి మా అబ్బాయిని నిర్ధారణ చెయ్యండి, కట్నం అవసరం లేదు''

ఈ ఉత్తరం చదివి విశ్వామిత్రుడిలా మండిపడుతున్న తండ్రిని చూసి సుందరి ''నాన్నగారూ కోపం తెచ్చుకోకండి. పళ్ళ దుకాణంలో మెరిసి పోయే యాపిల్‌పండుని డబ్బు ఎక్కువైనా కొని తినాలనుకుంటారు. అంతేకాని మచ్చలున్న యాపిల్‌ని ధర తగ్గిస్తామన్నా తీసుకోరుకదా! అలాగే ఈ పెళ్ళిచూపులు కూడా. అందంగా లేకపోవడం నా దురదృష్టం.